# పక్షులు




మంచు పొగలను, చీకటి తెరలను ఛిన్నా భిన్నం చేస్తూ ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి భోగి మంటలు ఆ మంటలను చూస్తున్నకొద్దీ రాంబాబు హృదయం ఆనందంతో పొంగిపోతోంది

మంట చుట్టూరా కూర్చుని చలి కాచుకుంటున్న ముసలయ్యలూ, ముతకయ్యలతోపాటు రాంబాబు తోటి పిల్లలు కూడా వున్నారు రాంబాబు వాళ్ళందరికీ దూరంగా కూర్చున్నాడు!

పామర్తి రాజేంద్రప్రసాద్

అతనికీ వాళ్ళందరితోపాటు కలిసి, వాళ్ళ సంతోషంలో భాగం పంచుకోవాలనే వుంది—కానీ ఆ పిల్లలు రాంబాబుని తమ జట్టులో కలుపుకోరు। వాళ్ళకీ రాంబాబును తమలో కలుపుకోవాలనే వుంది—కానీ వాళ్ళ పెద్దవాళ్ళు చూడటం జరిగితే వూరుకోరు।

వీపులు పచ్చడి చేస్తారు।

కారణం ఏమిటో ఆ పిల్లలకు కానీ, రాంబాబుకి కానీ తెలీదు

రాంబాబు తెలుసుకుందామని ఇంట్లో వాళ్ళను అడిగితే ఎవరూ నోరు మెదప లేదు ఇంకా అతనిలో కుతూహలం ఎక్కువై—తనతో చనువుగా వుంటూ, తనకన్నా వయసులో పెద్దవాడయిన స్నేహితుడు గోపీని అడిగితే-'త్వరలోనే దానికి సమాధానం చెబుతా'నన్నాడు సందర్భం వచ్చేవరకూ ఆగమన్నాడు

ఆ సందర్భంకోసం రాంబాబు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాడు

—ఆ పిల్లల పక్కన వెళ్ళి కూర్చోవాలన్న కోరికను అతికష్టంగా అపుకుంటూ ఆ మంటలలోకే తదేకంగా చూస్తున్నాడు రాంబాబు।

'మళ్ళీ సంవత్సరం వరకూ ఇంతటి మంటలను చూడలే'ననే ఒక రకమయిన దిగులుతో-ఆత్రంగా చూస్తున్నాడు ఆ ఆత్రుతలో కలిగే ఆనందాన్ని అనుభవిస్తున్నాడు।

గణ గణా మండే మంటలను చూడటం రాంబాబుకి ఎంతో యిష్టం।

అగ్గిపుల్లగీస్తే వచ్చేమంటా కాగితాన్ని కాల్చితే వచ్చేమంటా —రాంబాబు కంటికి ఆనవు।

ఇళ్ళు తగలబడుతున్నపుడు రేగే పెద్ద పెద్ద మంటలను చూడటం రాంబాబుకి ఇష్టం।

పొలాలలో గడ్డి వాములు తగలబడుతుంటే వచ్చే ఎర్రని జ్వాలలను చూడటం రాంబాబుకి మరీ యిష్టం।

—అయా సమయాలలో ఆకాశంలో చుట్టుకునే నల్లని దట్టమయిన పొగలను చూడటం రాంబాబుకి మరీ మరీ యిష్టం।

అందుకే రాంబాబుకి ఎండాకాలం అంటే ఎంతో ప్రీతి ఆ మూడు నెలల్లోనూ అతని కళ్ళకు కావలసినంత విందు।

ఎక్కడ యిళ్ళు తగలబడుతున్నా— రాంబాబు వెళతాడు చూడటానికి।

ఎక్కడో వూరిబయట గడ్డివాములు భస్మమవుతున్నా—అంతదూరమూ వుత్సాహంగా నడిచి—చూసి వస్తాడు

మామూలుగా యిట్లాంటి దృశ్యాలను పిల్లలకు చూపించకుండా జాగ్రత్త పడుతుంటారు పెద్దవాళ్ళు ఆ సమయంలో వాళ్ళను బయటకు వెళ్ళనివ్వకుండా కట్టుదిట్టం చేస్తూంటారు—కానీ రాంబాబుకి ఆ యిబ్బందిలేదు ఇంట్లో అతనికి సంపూర్ణ స్వాతంత్ర్యం వుంది అతను ఏంచేసినా 'అదే'మని ఎవరూ అడగరు।

"బాబూ"

వెనక్కు తిరిగిచూశాడు రాంబాబు

శివాలయం దగ్గర నిలబడివుంది వాళ్ళ అమ్మ, వంటినిండా ముసుగు కప్పుకొని

లేచాడు రాంబాబు ఆ మంటలను వదలి వెళ్ళటానికి మనసు ఒప్పలేదు





అయినా వాళ్ళ అమ్మ పిలుపును పెడ చెవిన పెట్టటం అతనికి యిష్టం వుండదు అందుకే యాంత్రికంగా లేచి నడిచాడు

రాంబాబు తలమీద చేయివేసి, నిమిరి, ఇంటివైపు తిరిగింది అతని తల్లి ఆమె చేయి పట్టుకొని యిబ్బందిగా అనుసరించాడు రాంబాబు

సామాన్యంగా యింటిలో వుండటం అతనికి నచ్చదు అక్కడ మనుషులు వుంటున్నా కానీ ఎప్పుడూ స్మశాన నిశ్శబ్దం రాజ్యం చేస్తూంటుంది। నోరు విప్పి ఎవరూ ఆప్యాయంగా మాట్లాడు కోరు యాంత్రికంగా ఎవరిపనులు వాళ్ళ చేసుకుపోతూంటారు రోజు మొత్తంమీద నాలుగయిదు పర్యాయాలకు మించి నోరు మెదపరు అదీ ఎంతో అవసరమయితేనే।

బడిలో కేరింతలు కొడుతూ మాట్లాడే పిల్లలమధ్య మసలటం నేర్చుకున్న రాంబాబుకి-ఇంటి వాతావరణం సరిపడక పోవటానికి కారణం అదే।

ఇంట్లోకి అడుగెట్టాడు రాంబాబు

హాలు గదిలో వేలాడుతున్న బొమ్మలను చూడగానే గుర్తుకువచ్చింది ఆరోజు తన కార్యక్రమం ఏమిటో

ఆ విషయం తలుచుకోగానే అతని శరీరం సంతోషంతో జలదరించింది 'కొత్త అనుభూతిని చవిచూడబోతున్నా' నన్న ఆనందం వుక్కిరి బిక్కిరి చేసింది

గబ గబా పెరట్లోకి వెళ్ళి మొహం కడిగాడు

వాళ్ళమ్మా అక్కయ్యా కలిపి సీకాయ పొడితో తలంటి, వేడినీళ్ళ పోస్తూంటే భోగిమంటల ముందు కూర్చున్న అనుభూతి కలిగింది అతనికి।

తలంటు స్నానం పూర్తయేసరికి తెల్లవారిపోయింది

*    *    *

గోడ గడియారం ఏడు గంటలు కొట్టింది

మధ్య గదిలో కూర్చొని కాఫీ తాగుతున్నాడు రాంబాబు అప్రయత్నంగా అతని కళ్ళు ఎదురుగా గోడకు అమర్చబడిన నిలువెత్తు ఫోటో మీదకు మళ్లాయి

ఆ ఫోటోలో వున్న వ్యక్తి తనకు తండ్రి అని రాంబాబుకి తెలుసు ఆయన చనిపోయాడని కూడా తెలుసు కానీ ఎందుకు? ఎప్పుడు? ఎక్కడ? అనే విషయాలు తెలీవు తెలుసుకోవాలనే ఆరాటం అతనికిలేదు అసలు-ఆయన వుండటం వల్ల లాభం ఏమిటో లేకపోవటంవల్ల నష్టం ఏమిటో కూడా తెలీదు

"ఆయన బ్రతికున్న రోజుల్లో ఎంత గొప్పగా, గౌరవంగా బ్రతికాము" అని వాళ్ళమ్మ అప్పుడప్పుడూ తనలో తాను అనుకోవటంలో అంతరార్థం ఏమిటో రాంబాబుకి అంతుబట్టదు

ఎంతో హుందాగా, గంభీరంగా కనిపించే ఆయన ఆకారాన్ని చూడటం రాంబాబుకి భయం!

అందుకే అక్కడనుంచి కదిలి వాళ్ళ అన్నయ్య గదిలోకి వెళ్ళాడు

తీరికగా బల్లముందు కుర్చీ వేసుకు కూర్చొని తాగుతూ కనిపించాడు ఆయన తాగుతున్నది కాఫీ కాదు—ఆ విషయం మాత్రం తెలుసు రాంబాబుకి! అది తాగుతున్నపుడు అతని ప్రవర్తన ఎట్లా వుంటుందో తెలుసు "హుం ఈవాళ ప్రొద్దునే మొదలెట్టాడు " అనుకుంటూ ఆ గదిలోనుంచి బయటికి వచ్చాడు

వాళ్ళ అక్కయ్య గది ముందుకు వెళ్ళి తలుపు నెట్టాడు లోపలికి వెళ్ళబోతూ ఆగాడు

నిలువెత్తు అద్దంలో నగ్నంగా తన అందాన్ని చూసుకుంటూ-కొత్త చీర కట్టుకుంటోంది, వాళ్ళ అక్కయ్య!

చటుక్కున బయటికి వచ్చాడు ఛళ్ళున తలుపుమూసి వంట గదిలోకి వెళ్ళాడు వాళ్ళమ్మ పక్కన కూర్చొని కాఫీ తాగటం పూర్తిచేశాడు

మరికొద్ది సేపట్లో హాలు గదిలో పుస్తకాలు ముందర వేసుకుని కూర్చున్నాడు చదవటానికి కాదు చదువుతున్నట్లు నటించటానికి! నటిస్తూ-చుట్టూరా గోడలకు వ్రేలాడుతున్న అందమయిన స్త్రీల అర్ధనగ్న చిత్రాలను చూడటానికి!-రాంబాబుకి ఆ చిత్రాలను చూడటమంటే కూడా ఎంతో యిష్టం!

అతని స్నేహితుడు గోపీ యిచ్చే సెక్స్ పుస్తకాలు హాల్లో కూర్చొని చదువుతూ-ఒక్కో రోజు ఒక్కో బొమ్మలో వున్న స్త్రీని తన పక్కన భావించుకోవటం రాంబాబు దినచర్యలో ముఖ్యమయినది!

ఆ బొమ్మల మధ్యన విసిరివేయబడినట్లుండే మరో చిత్రం వుంది దాన్ని చూడటం రాంబాబుకి యిష్టం వుండదు మిగతా వాటితో సంబంధం లేకుండా వుండే ఆ బొమ్మమీద రాంబాబుకి చెడ్డ

కోపం! దాన్ని కసితీరా చింపి, నిప్పంటించి-ఆ మంటలను చూపి ఆనందించాలని అతను ప్రతిరోజూ అనుకుంటూ వుంటాడు

ఎంతో అందమయిన ఆ బొమ్మల మధ్య ఆ చిత్రం వుండవలసింది కాదని అతని అభిప్రాయం

అందులో—

నీతి నియమాలతో, సంఘంతో, కట్టుబాట్లతో పనిలేని పక్షులు స్వేచ్ఛగా తలా ఒక దిక్కుకు ఎగిరిపోతూంటాయి!

గడియారంలో టైం చూశాడు రాంబాబు

ఎనిమిది గంటలు

ఇంకా పన్నెండు గంటలకు రమ్మని చెప్పాడు గోపి

ఎప్పుడు రాత్రి అవుతుందా అని కాచుకు కూర్చున్నాడు రాంబాబు

* * *

రాత్రి ఏడు గంటలు

ఇంట్లో రాంబాబు వాళ్ళమ్మ ఒక్కర్తే వుంది

వాళ్ళక్కయ్య సాయంత్రం అయిదింటికే మామూలుగా ముస్తాబై వెళ్ళిపోయింది




ఎక్కడికో అన్నయ్య ఎప్పుడో మధ్యా న్నమే వెళ్ళిపోయాడు

మెల్లగా బయటపడదామా అనిపించింది రాంబాబుకి ఇంకా గంటసేపు ఆగలేక పోయాడు చొక్కా లాగూ వేసుకొని నీటుగా ముస్తాబై సైన్సు పుస్తకంలో దాచుకున్న డబ్బులు తీసి జేబులో పెట్టు కున్నాడు

వాళ్ళమ్మ ఏమీ అనేది కాకపోయినా ఆమె ఎక్కడ చూస్తుందోననే భయంతో పిల్లిలా—తలుపు తీసి బయటకు జారు కున్నాడు

గోపీ వాళ్ళింటికి చేరుకున్నాడు కాసేప టిలో

అతను తయారై రెడీగా వున్నాడు రాంబాబుని చూడగానే బయటకు వచ్చాడు

"డబ్బులు తెచ్చావా?"—అడిగాడు

తల వూపాడు రాంబాబు "తెచ్చాను" అని నోరు విప్పి చెప్పలేక పోయాడు.

ఇద్దరూ నడక ప్రారంభించారు

రాంబాబు కుతూహలపు కోరిక గంతు లేస్తోంది సెక్స్ పుస్తకాలు చదువుతుంటే కలిగే అనుభూతిని మించిన హాయి తను కాసేపటిలో పొందబోతున్నాడని ఆనంది స్తున్నాడు కానీ—చుట్టు ప్రక్కన ఇళ్ళల్లో వాళ్ళు తమను చిన్నచూపు చూడటానికి కారణం ఏమిటని ఎప్పుడో తను అడిగిన సందేహానికి గోపీ ఇప్పుడు సందర్భసహి తంగా సమాధానం చెప్పబోతున్నాడని రాంబాబుకి తెలీదు గోపీ చెప్పలేదు ముందుగా చెప్పదలుచుకోలేదు

రాంబాబుకన్నా గోపీ పెద్దవాడు అత నికి పదిహేను సంవత్సరాలు దాటాయి అయినా ఇంకా ఆరవ తరగతిలోనే వున్నాడు రాంబాబు దృష్టిలో అతను తనకు 'గురువు.'

రాంబాబుకి తెలీని ఎన్నో విషయాలు చెబుతూంటాడు గోపీ పన్నెండేళ్ళ వయ సులో వున్న రాంబాబులో రేగే సందేహా లను గోపీ తీర్చుతూంటాడు

మిగతా వాళ్ళలా కాకుండా గోపీ రాంబాబుతో కలిసి చనువుగా వుంటాడు అందుకే కొన్ని సందర్భాలలో గోపీ ప్రవ ర్తన రాంబాబుకి నచ్చకపోయినా తనకున్న ఒక్క మిత్రుడినీ వదులుకోవటం ఇష్టంలేక అతనితో కలిసిపోతూంటాడు.

పెద్దపెద్ద రోడ్లు దాటి వూరి చివరలో వున్న ఒక 'పేట' లోకి వచ్చారు. స్నేహితులిద్దరూ

నాలుగయిదు మలుపులు తిరిగి ఓ వీధి లోకి చేరుకున్నారు

"అదిగో ఆ ఇల్లే వెళ్ళు లోనికి" ఓ ఇంటిని చూపిస్తూ రాంబాబుతో చెప్పాడు గోపీ

రాంబాబుకి ధైర్యం చాలలేదు "నువ్వు కూడా రా" అన్నాడు


"తరువాత వస్తాను ముందు నువ్వు వెళ్ళు ఇద్దరు వుంటారు అక్కడ వాళ్ళలో ఎవరు కావాలో నీ ఇష్టం."

రాంబాబు రెండడుగులు ముందుకు వేశాడు, వెళదామని

మళ్ళీ నాలుగడుగులు వెనక్కు వేశాడు భయంతో

"ఫరవాలేదు వెళ్ళు" ధైర్యంచెప్పాడు గోపీ

పరుగులాంటి నడక నడిచాడు




రాంబాబు

ఆ ఇంటిముందు ఆగాడు గోపీవైపు చూశాడు ఏం చేయాలో తోచక

తలుపు తట్టమన్నట్లు సైగ చేశాడు గోపి

చెప్పినట్లు చేశాడు రాంబాబు

తలుపులు తెరుచుకున్నాయి

కొద్దిగా తటపటాయించాడు రాంబాబు

"వెనక్కు తిరిగొస్తాడేమో ఖర్మ!" అనుకున్నాడు గోపి కానీ అతననుకున్నట్లు జరగనందుకు సంతోషించాడు

రాంబాబు లోపలకు వెళ్ళగానే తలుపులు మూసుకున్నాయి

గోపీ చిన్నగా నవ్వుకున్నాడు

* * *

విసురుగా బయటికివచ్చాడు రాంబాబు. అతని ముఖం నిండా నీటి బిందువులు నిలిచివున్నాయి

చుట్టూ చూశాడు

ఎక్కడా కనిపించలేదు గోపి.

కోపంతో కంపించిపోయాడు రాంబాబు అతనికి తెలీకుండానే పళ్ళు పటపట లాడాయి ఆ సమయంలో గోపి అక్కడే వున్నట్లయితే అతన్ని ఏం చేసేవాడో?

పక్కనే వున్న బండరాయిని కాలితో కసిగా తన్నాడు అంతకు మించి ఇంకేమీ చేయలేక అదివెళ్ళి కాలువలో ప్రవాహానికి అడ్డుగా పడ్డది అయినా రాంబాబులో

కోపం తగ్గలేదు

వేగంగా నడక ప్రారంభించాడు

రకరకాల ఆలోచనలతో సతమత మవుతూ నడుస్తున్నాడు వయసుకు మించిన ఆలోచనలు అతని మెదడులో ప్రవేశించాయి ఆ సమయంలో అతని లేత మొహం అమాయకంగా లేదు జీవితాన్ని అంతా కాచి వడబోసి అనుభవ సారాన్ని జీర్ణించుకున్న వేదాంతి గంభీర వదనంలా వుంది

ఇంటికి చేరాడు రాంబాబు

వెళ్ళటంతోనే వాళ్ళ అక్కయ్య గది వైపు చూశాడు వికారంగా చూశాడు

రోజూ అతనికి వాళ్ళ అక్కయ్య దగ్గర పడుకోవటం అలవాటు ప్రతిరాత్రీ ఆమె ఆలస్యంగా ఇంటికి వస్తుందని అతనికి తెలుసు అందుకే తనకు నిద్రరాగానే వెళ్ళి ఆమె గదిలో పడుకుంటాడు అర్థ రాత్రి మెలకువ వచ్చినపుడు చూస్తే తనను చుట్టుకొని నిద్రపోతూ వుంటుంది అక్కయ్య

తమ్ముడిమీద ఆమెకు అంత అభిమానం

కానీ ఇప్పుడు రాంబాబుకి ఆ గదిలో పడుకోవాలంటే అసహ్యం వేసింది

హాల్లో పక్క వేసుకున్నాడు

భోజనంచేయకుండా, బట్టలు మార్చుకోకుండా పక్కమీద వాలిపోయాడు

రాంబాబు రావటం వాళ్ళమ్మ గమనించలేదు గమనించిన తరువాత భోజనానికి లేపితే రాంబాబు పలకలేదు నిద్రపోయాడేమో అనుకుంది

అంతులేని ఆలోచనలతో వేడెక్కిన రాంబాబు మెదడు ఎప్పటికో నిద్రలోకి జారుకుంది!

* * *

నిద్రలో ఏవేవో కలలు

అర్థం పర్థం లేని దృశ్యాలు

ఏవో అరుపులు——

సముద్రాల హోరు——

పెనుగాలుల బీభత్సం

మంటలు, పొగలు, వాగులు, వరదలు.

ఆ మంటలలో రాంబాబు దూకాడు మాడిపోయాడు వుడికిపోయాడు అయినా ప్రాణం పోలేదట!

వాగులో దూకి కొట్టుకుపోయాడు. ప్రవాహం వుక్కిరి బిక్కిరి చేస్తోంది

వూపిరి ఆడటం లేదు ప్రాణం పోతోంది ప్రాణంపోతోంది ప్రాణం పోతోంది

కెవ్వున అరిచాడు రాంబాబు

కళ్ళు తెరిచి చూశాడు

అతని అరుపుకు ఎవరూ నిద్రలేపలేదు

అందరూ గాఢ నిద్రలో వున్నారు

జరిగినదంతా కల అనుకొని మళ్ళీ పడుకోబోయాడు భయాన్ని ఒక పక్కకు నెట్టి

కానీ ఇంటినిండా పొగలు చుట్టుకోవటం అతని కళ్ళ బడింది పక్కమీదనుంచి లేచి నిలుచున్నాడు కళ్ళు నలుపుకొని చూశాడు తృళ్ళిపడ్డాడు

గోడలమీద బొమ్మలు లేవు ఒక్కటి తప్ప

అన్నిటినీ క్రింద కుప్పగా పోసి కాల్చారు ఎవరో నల్లటి మసి రేకులు పొగులుగా పడి వున్నాయి, మధ్య మధ్యన నిప్పురవ్వలతో

పక్కనే కొన్ని పుస్తకాలు—అవీ తగలబడే వున్నాయి కానీ నలిగిపోకుండా వున్నాయి పుస్తకాల్లానే పట్టుకుంటే చితికిపోతాయి వాటిమీద ఏవో బొమ్మలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి

నాలుగడుగులు ముందుకు వేశాడు రాంబాబు మోకాళ్ళను నేలమీద ఆన్చి, ఆ పోగు ముందు కూర్చొని పరీక్షగా చూశాడు

అవి—గోపీ తనకిచ్చిన పుస్తకాలు।

అతనికేమీ అర్థంకాలేదు ఏం జరిగిందో వూహించలేకపోయాడు తల పైకెత్తి మిగిలిపోయిన ఒక్కబొమ్మనూ చూశాడు

అందులో

నీతి నియమాలతో, సంఘంతో, కట్టుబాట్లతో పనిలేని పక్షులు స్వేచ్ఛగా తలాఓ దిక్కుకు ఎగిరిపోతున్నాయి।

"రంగ్" మన్న మ్రోత మోగడంతో వులికి పడ్డాడు రాంబాబు

గోడగడియారం పన్నెండు గంటలు కొడుతోంది

దీర్ఘంగా నిట్టూర్చాడు

ఇంకా ఇంటిని దట్టమయిన పొగలు ఆవరిస్తున్నాయి రాంబాబు కళ్ళల్లోకి ప్రవేశించి మంటలు పెడుతున్నాయి అయోమయంగా వుంది అతనికి, పొగలు ఎక్కణ్ణుంచి వస్తున్నాయోనని।

అక్కణ్ణుంచి లేచి మధ్య గదిలోకి వెళ్ళాడు వెళ్ళగానే అతనికి తల తిరిగినంత పని అయింది వాళ్ళ అక్కయ్య గది తలుపు సందులలోనుంచి, తెరిచివున్న కిటికీలో నుంచి పొగలు బయటికి చిమ్ముతున్నాయి

రాంబాబు వళ్ళు జలదరించింది

తలుపుల దగ్గరికి వెళ్ళి 'దబదబా' బాదాడు

తెరుచుకోలేదు

అరిచాడు పెద్దగా

"అక్కా అక్కా " అంటూ

ఆ అరుపుకు వంట గదిలో నిద్రపోతున్న వాళ్ళమ్మకు మెలకువ వచ్చింది

మత్తులో మునిగివున్న వాళ్ళ అన్నయ్యకు ఆ పిలుపు అందలేదు వాళ్ళక్కయ్య గదితలుపులు తెరుచుకోలేదు

కిటికీ దగ్గరికి వెళ్ళి లోపలకు చూశాడు రాంబాబు

అతని వళ్ళు చల్లబడిపోయింది।

వాళ్ళ అక్కయ్య పరుపు తగలబడిపోతోంది పెద్ద పెద్ద మంటలతో। ఆ మంటలలో నుంచి కొద్ది క్షణాలక్రితమే నల్లగా మాడిపోయి వికృతరూపం దాల్చిన వాళ్ళ అక్కయ్య శరీరం రాంబాబుకి కన్పించలేదు అయినా అతని వూహాపథంలో ఆ రూపం మెదిలింది। అంతే "అక్కా " అంటూ అతను అరిచిన అరుపుకు వాళ్ళ అన్నయ్యకూడా మత్తు వదిలింది।

గది నంతటినీ ఆవరించిన మహాగంభీరమైన ఆ ఎర్రని జ్వాలలు రాంబాబుకి సంతోషాన్ని కలిగించలేదు హద్దూ, అదుపూ లేకుండా పెరిగిన అతని మనసును వశం తప్పించాయి।

